
సాక్షి
పల్నాడు
సోమవారం । 6 । మే । 2024



ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలోని మహంకాళేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవాని పాలెం): చందోలులో గల శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ఓటమి భయంతోనే దాడులు
ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేటరూరల్: ఓటమి భయంతోనే టీడీపీ దాడులకు పాల్పడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మండలంలోని రావిపాడు వెంగళరెడ్డి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కాలనీలో ప్రచారం ముగిసిన అనంతరం టీడీపీ కార్యకర్తలు తన ఇంటి ముందు ఉన్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపై ఒక్కసారిగా కర్రలతో దాడులకు దిగారు. దాడిలో బొద్దు శ్రీనివాసరావు, చందు, శాలమ్మ గాయపడ్డారు. వీరిని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో గెలవడం కష్టమని తెలిసి టీడీపీ హింసకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించే కుట్ర జరుగుతుందన్నారు. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, నాయకులు మూరే రవీంద్రారెడ్డి, జాన్ ఉన్నారు.

పింఛన్ తీసుకోవడానికి వెళ్లి వృద్ధురాలు మృతి

బెల్లంకొండ: పెన్షన్ తీసుకోవడానికి వెళ్లి 75 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని పాపాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన ఓర్సు వెంకటరమణ (75)కు దాచేపల్లి స్టేట్ బ్యాంకులో అకౌంట్ వుంది. ఆమె పింఛన్ నగదు బ్యాంకు అకౌంట్‌లో జమ అయినట్లు చెప్పడంతో తీసుకోవడానికి శనివారం బ్యాంకుకు వెళ్లింది. ఎండలో బ్యాంకు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని బయటకు వచ్చిన వృద్ధురాలు కళ్లు తిరిగి పడిపోయింది. గమనించిన స్థానికులు ఆమె వద్దకు వెళ్లి గమనించగా చనిపోయినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఉన్న బ్యాంకు అకౌంట్ పుస్తకం, పెన్షన్ బుక్‌లో వివరాలు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆటో తీసుకుని వెళ్లి వెంకటరమణ మృతదేహాన్ని స్వగ్రామం పాపయపాలెం తీసుకుని వచ్చారు. గతంలో మాదిరిగా వలంటీర్ల ద్వారా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి ఉంటే మృతిచెంది ఉండేది కాదని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

పిడుగుపాటుకు గేదెలు మృతి

రెంటచింతల: రెంటచింతల గ్రామ సమీపంలోని జ్యోతి స్వరూప కోల్డ్ స్టోరేజ్ వద్ద పంటపొలాలలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై రెండు పాడిగేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బోయిన మైసయ్య తన గేదెలను మేత (పశుగ్రాసం) కోసం పొలం వెళ్లగా సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి పెనుగాలులతోపాటు పిడుగులు పడ్డాయి. గేదెలు ఉన్న ప్రాంతంలో పిడుగు పడడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 1.40 లక్షలు ఉంటుందని మైసయ్య తెలిపారు.

59 మేకలు మృతి

దుర్గి:మండలంలోని కాకిరాల గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గురై 59 మేకలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన బూదిరి లక్ష్మయ్య, కొంగా గోవిందు, కొంగా పెదగంగయ్యలు మేకలను మేపుకునేందుకు పొలానికి వెళ్లారు. వర్షపు జల్లులు పడుతుండగా మేకలను చెట్టు కిందకు తోలుకెళ్లారు. ఆ సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే 59 మేకలు మృతి చెందాయి. బూదిరికి లక్ష్మయ్యకు చెందిన 40 మేకలు, కొంగా పెద గంగయ్య 15, కొంగా గోవిందు నాలుగు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. పిడుగుపాటుకు కొంగా లక్ష్మీనారాయణ, బూదిరి లక్ష్మయ్యలు స్పృహ తప్పి పడిపోయారు. వర్షం వెలిసిన అనంతరం గ్రామస్తులు పొలానికి వెళ్లి ఘటనాస్థలాన్ని చూసి వెంటనే వారి బంధువులకు సమాచారాన్ని ఇచ్చారు. అనంతరం వారిరువురిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట ఆసుపత్రికి తరలించా రు. ఘటనా స్థలాన్ని వీఆర్వో రత్నప్రకాష్ సందర్శించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

భూ సమస్యలకు రీసర్వేతో చెక్



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఇగుటూరి కోటిరెడ్డి. నరసరావుపేట మండలం దొండపాడు గ్రామం. ఇతనికి దొండపాడులో 1.73 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దశాబ్దాలుగా ఈ భూమి సాగు చేస్తున్నా సరైన హద్దులు, మ్యాప్‌లు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రీ సర్వే ద్వారా ఆయన పొలాన్ని కొలచి, హద్దు రాళ్లు వేయడంతోపాటు శాశ్వతహక్కు పత్రాలు, మ్యాప్‌లు అందజేశారు. ఏ ఆఫీస్ మెట్లు ఎక్కకుండా, రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఆయన సమస్య తీరింది. భవిష్యత్‌లో ఎటువంటి భూ సమస్యలు రాకుండా రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని రైతు కోటిరెడ్డి అభిప్రాయపడుతున్నారు.

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంతో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- జిల్లాలో మూడు దశల్లో 338 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే
- 13,66,403 ఎకరాలకు రికార్డులు సరిచేస్తున్న వైనం
- 91,370 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ



రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, చిత్రంలో ఎమ్మెల్యేలు పిన్నెల్లి, నంబూరు, గోపిరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, కలెక్టర్ శివశంకర్ (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: చెదలు పట్టిన భూ రికార్డులు, ఎవరి భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. అడ్డూ అదుపులేని అక్రమాలు ఓ వైపు, న్యాయపరమైన చిక్కులు మరోవైపు. వీటన్నింటికి పరిష్కారం చూపి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష కార్యక్రమం రైతులకు వరంగా మారింది. భూముల రీ సర్వేకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడంతో దశాబ్దాలుగా ఉన్న భూ చిక్కుముడులు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. పల్నాడు జిల్లాలో వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష ద్వారా భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోంది. అటు భూ సర్వే, ఇటు సర్వే రాళ్ల ఏర్పాటు, భూహక్కు పత్రాల పంపిణీ ఇలా అన్ని పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో భూ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూమి చుట్టూ హద్దు రాళ్లు పాతారు



నాకు మూడెకరాల భూమి ఉంది. ఇటీవల జరిగిన రీ సర్వే ద్వారా నా పొలాన్ని కొలచి, భూమి చుట్టూ హద్దు రాళ్లు వేశారు. అలాగే శాశ్వత భూ హక్కు పత్రం అందజేశారు. ఇందులో క్యూర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో సహా అన్ని వివరాలూ ముద్రించారు.

– గాయం గోవిందరెడ్డి, మాచవరం, రొంపిచర్ల మండలం.

43,00,414 హద్దు రాళ్లు పాతి

జిల్లాలో ల్యాండ్ అండ్ సర్వే అధికారులతోపాటు రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుంటూ భూ సర్వే విజయవంతంగా అమలైంది. జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 28 మండలాలు, 363 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో ఇనాం, పట్టణాల్లో విలీనమై గ్రామాలుపోను 338 గ్రామాల పరిధిలో మొత్తం 13,66,403 ఎకరాల భూ విస్తీర్ణం డ్రోన్ ద్వారా సర్వే పూర్తిచేశారు. రెండు డ్రోన్లు, 114 రోవర్లు పనిచేశాయి. మూడు దశల్లో కలిపి మొత్తం 273 గ్రామాల్లో ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్‌లు, 181 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తిచేశారు. ఇప్పటి వరకు 91,370 మందికి రీసర్వే తర్వాత కొత్త ఖాతాలు జారీచేసి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన శాశ్వత భూ హక్కు పత్రాలు, మ్యాప్‌లు అందజేశారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తికావడంతో వీలైనంత త్వరగా రీసర్వే పూర్తి చేసి శాశ్వత భూహక్కు పత్రాలు అందించేలా అధికారులు పనిచేస్తున్నారు. 361 మంది విలేజ్ సర్వేయర్లు, 370 మంది వీఆర్వోలు రీ సర్వేలో పనిచేస్తున్నారు. మూడు దశల్లో కలిపి 3,00,414 హద్దు రాళ్లను పాతి శాశ్వత హద్దులు ఏర్పాటు చేశారు.

జిల్లాలో రీ సర్వే చేస్తున్న మొత్తం రెవెన్యూ గ్రామాలు **338**

మొత్తం భూ విస్తీర్ణం **13,66,403** ఎకరాలు

రీ సర్వేకు ఉపయోగిస్తున్న డ్రోన్లు - **2** రోవర్లు - **114**

డ్రోన్, ఏరియల్ ఫ్లైట్ సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాలు **338**

ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్ పూర్తయిన గ్రామాలు **273**

గ్రౌండ్ ట్రూ థింగ్ పూర్తయిన గ్రామాలు **181**

రైతులకు జారీ చేసిన శాశ్వత హక్కు పత్రాలు **91,370**

రైతుల పొలాల్లో నాటిన హద్దు రాళ్ల సంఖ్య **3,00,414**



మాచర్లలో సీఎం వైఎస్ జగన్ బహిరంగసభ జరిగే ప్రదేశాన్ని పోలీసు అధికారులతో కలసి పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బింధుమాదవ్

నేడు మాచర్లకు సీఎం వైఎస్ జగన్

- మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగసభ
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు
- తరలిరానున్న పార్టీ శ్రేణులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి



మాచర్లలో హెలిప్యాడ్ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పల్నాడు జిల్లా మాచర్ల రానున్నారు. పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి సీఎం జగన్ ప్రసంగించనున్నారు. గుంటూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న మైదానంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర, క్రోసూరు సభలు విజయవంతమైన రీతిలోనే ఈ సభను భారీ సక్సెస్ చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

కట్టుదిట్ట భద్రత

సీఎం పర్యటన నేపథ్యలో జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బింధుమాదవ్ సీఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన గ్రౌండ్, బహిరంగసభ జరిగే ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు తదితర విషయాలపై సిబ్బందికి తగు సూచనలు చేశబూరు. హెలిప్యాడ్ నుంచి సభ వరకు సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులను ఇప్పటికే పోలీసులు తమ ఆధీనంలోకి తెచ్చుకొని భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్పీ పోలీసు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.

మొదలైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



నరసరావుపేటలోని పోలింగ్ కేంద్రంలో పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్



మాచర్లలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

- ఏడు నియోజకవర్గాల్లో ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు
- ఓటు వేసిన పీఓ, ఓపీఓ, మైక్రోఅబ్జర్వర్, ఇతర పోలింగ్ సిబ్బంది
- తొలి రోజు 10,240 మందికి అవకాశం
- రాత్రి 9 గంటల వరకు ఓటు వేసిన వారు 8,015 మంది
- 8వ తేదీ వరకు కొనసాగనున్న పోలింగ్
- నరసరావుపేట ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో ఏర్పాట్లు సరిగా చేయని అధికారులు

సాక్షి,నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం ప్రారంభమైంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా పీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లు, ఇతర ముఖ్యమైన పోలింగ్ సిబ్బందికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ కేటగిరి కింద జిల్లాలో మొదటి రోజు 10,240 మందికి అవకాశం కల్పించారు. ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సాధారణంగా కొంత ఆలస్యం అవుతుంది కనుక ఓటర్లు ఎక్కువ సేపు లైన్‌లో ఉండాల్సి వచ్చింది. దానికి తోడు నరసరావుపేట లాంటి అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్న ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోలింగ్ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండడం ఇబ్బందిగా మారింది. స్థానిక ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బారికేడ్లు, కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలమయ్యారని ఓటర్లు వాపోయారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లాలోని పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఓటింగ్ తీరు పరిశీలించి, పోలింగ్ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 8వ తేదీ వరకు కొనసాగనుందని, అందరూ ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. జేసీ శ్యాంప్రసాద్ మాచర్లలో జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచేలా చూశారు. ఆదివారం రాత్రి 9 గంటలకు జిల్లాలో 10,240 మందికిగాను 8,015 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు స్లిప్పులు అందజేసి వారికి ఓటింగ్ అవకాశం కల్పించారు.

నియోజకవర్గం	తొలి రోజు మొత్తం ఓట్లు	రాత్రి 9గంటలకు ఓటు వేసిన వారు	పోలింగ్ శాతం
పెదకూరపాడు	1,161	964	83.03
చిలకలూరిపేట	1,702	1,219	71.62
నరసరావుపేట	1,906	1309	68.68
సత్తెనపల్లి	1,529	1,238	80.97
వినుకొండ	1,522	1,355	89.03
గురజాల	1,179	910	77.18
మాచర్ల	1,241	1020	82.19
మొత్తం	10,240	8,015	78.27

సీఎం జగన్ పథకాలతో ఆర్యవైశ్యులకు ప్రయోజనం

ఆత్మీయ సమావేశంలో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తదితరులు

నరసరావుపేట: ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలతో పేద ప్రజలతోపాటు ఆర్యవైశ్యుల వ్యాపారాలకు కూడా ప్రయోజనం చేకూరిందని వైఎస్సార్ సీపీ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జమిందారు ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి గుంటూరు ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తోపాటు ఇరువురూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా పన్ను చెల్లింపుదారులు ఆర్యవైశ్యులే అన్నారు. ప్రభుత్వానికి ఫైనాన్షియల్ సపోర్టు ఇచ్చేవారిలో ఆర్యవైశ్యులే ముఖ్యులని పేర్కొన్నారు. అయితే తాము చెల్లించే పన్నులను పేదవర్గాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారనే అపోహ కొందరిలో ఉందన్నారు. సీఎం జగన్ డబ్బులు పంచుతున్నారని ప్రచారం చేసిన ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు అంతకంటే ఎక్కువగా ఇస్తామని మేనిఫెస్టో ద్వారా వాగ్దానాలు చేస్తున్నారని వివరించారు. నెల్లూరులో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన తాను ఆర్యవైశ్యులకు అండగా ఉన్నాననే కానీ ఏ రోజూ వారిని ఇబ్బందిపెట్టలేదు అన్నారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ వలన ప్రజలకు చాలా ప్రయోజనం చేకూరిందని, ఆ వ్యవస్థను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థను తూలనాడిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు తాము అధికారంలోకి వస్తే ఆ వ్యవస్థను కొనసాగించి ఎక్కువ జీతాలు ఇస్తామని చెబుతున్నారన్నారు. వారు రెండునెలలు పాటు పనిచేయకపోతే పింఛన్‌దారులు బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందిపడుతున్నారన్నారు. సీఎం జగన్ అమలు చేసే పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా 2.25లక్షల ఆర్యవైశ్య కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయన్నారు. ఆర్యవైశ్యులకు రాజకీయంగా అండగా నిలుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, జేఎన్‌టీయూ సెనేట్ మాజీ మెంబరు మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, నాయకులు డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, కేపీ రంగారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, చిన్ని శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు, దివ్వెల రామకృష్ణ, కొత్తూరి సాంబశివరావు, వి.సాంబశివరావు, ఎన్.సురేంద్ర, ఎన్.సురేష్, భారీ సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ సోదరులకు తోడుగా ఉంటా

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: ఎస్సీ సోదరులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చికి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చర్చి డెలిగేట్లు డేగల సంసోన్, సామేలు ఇద్దరూ తనను కలిసి 1903 సంవత్సరంలో నిర్మించిన చర్చి అభివృద్ధికి సహకరించాలని కోరారని, వెంటనే తన సొంత నిధులు రూ. 25 లక్షల వ్యయంతో చెప్పిన సమయా నికి చర్చి అభివృద్ధి పనులు పూర్తిచేసి వారికి కానుకగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తాను ఎల్లవేళలా ఎస్సీ సోదరులకు తోడుగా ఉంటానన్నారు. సీఎం జగన్ ఎస్సీ సామాజిక వర్గానికి అన్నిరంగాల్లో తగిన ప్రాధాన్యతను ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ముందుగా చర్చిలో పాస్టర్ కటికల ఏసుదానంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకట రామిరెడ్డి (రాంబాబు), జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, గుజ్జుల సైదారెడ్డి, డేగల సంసోన్, డేగల సామేల్ తదితరులున్నారు.







ప్రచార పర్వం

పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ప్రజలు వారికి బ్రహ్మరథం పడుతున్నారు. రెంటచింతల మండలం మంచికల్లులో శనివారం రాత్రి మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రచారం నిర్వహించారు. గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి ఆదివారం ప్రచారం నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

క్లుప్తంగా

జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

ఏపీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్తా చిన్నపురెడ్డి



రెంటచింతల: ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని ఏపీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్తా చిన్నపురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, ఎంపీగా పి. అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఐదేళ్ల పరిపాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, ఏరువ విజయరెడ్డి, గుజ్జుల సైదారెడ్డి, గంజి బాలరెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, ఏరువ ప్రతాప్ రెడ్డి, పేర్ల లక్ష్మయ్య, బంకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

గిరిజనులకు మేలు జరగాలంటే జగనే రావాలి

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతునాయక్

దుర్గి: పేద, బడుగు, బలహీన వర్గాల గిరిజనులకు మేలు జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్‌సీపీ ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతునాయక్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మంగాపురంతండా, చంద్రకుంట తండ, లక్ష్మీపురం తండాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాలలోని గిరిజన కుటుంబాలను కలిసి వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వర్గంలో గిరిజనులకు సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మెంబర్ సభావత్ రవి నాయక్, సర్పంచ్‌లు రమావత్ మాద్యానాయక్, కేతావత్ శ్రీనునాయక్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డిస్ట్రిక్ కమిటీ మెంబర్ రంగానాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతావత్ శ్రీను నాయక్, బోజ్యానాయక్, మోతీలాల్ నాయక్, మునీ నాయక్, అంజనీ కుమార్ నాయక్, సంతోష్ నాయక్, రాము నాయక్ పలువురు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- వారి వ్యాపారాలకు తోడుగా నిలబడతాం
- రాజకీయంగా సముచిత స్థానం కల్పించింది వైఎస్సార్‌సీపీనే
- ఆర్యవైశ్యులంతా వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలి
- నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



అనిల్‌కుమార్‌యాదవ్, కాసు మహేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

పిడుగురాళ్ల: ఆర్యవైశ్యులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడు అండగానే ఉంటుందని వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి వాసవీ అమ్మవారి చిత్ర పటానికి పూల మాలలు వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందించడం వల్ల ప్రతి ఆర్యవైశ్య వ్యాపారాలు బాగున్నాయన్నారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ది కావాలా, డబ్బులు, అహంకారం, పెత్తందారుల వ్యవస్థల కావాలో మీరు నిర్ణయించుకోవాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, నర్సరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భవనాశి యల్లా రావు, వివిధ అసోసియేషన్ అధ్యక్షులు, దేవస్థాన అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయంగా ప్రోత్సహించా

- వ్యాపారులను దోచుకునే మనస్తత్వం నాది కాదు
- నేను ప్రాణం పోసిన వారు నన్ను వదిలి వెళ్లినా లెక్కచేయను
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రాణాపాయంలో ఉన్నప్పుడు సాయం చేసి బ్రతికించిన వ్యక్తులు, నావల్ల పదవులు పొంది లాభం పొందిన వారు అవసరమైన సమయంలో నన్ను వదిలి మోసం చేసి వెళ్లారనే బాధ గుండెను పిండేస్తుందని, ఇదేనా మానవ సంబంధాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి , నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని గోసంరక్షణ శాలలో జరిగిన ఆర్యవైశ్య కుటుంబాల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లం చర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పాలనలో ఎవరినీ వేధించలేదని, అక్రమంగా సంపాదించలేదన్నారు. నియోజక వర్గంలో ఆర్యవైశ్యులను రాజకీయంగా ప్రోత్సహించానని గుర్తు చేశారు. పట్టణంలో మాత్రమే ప్రత్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉండటంతోనే ఈ వర్గానికి మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టానని స్పష్టం చేశారు. ఆర్యవైశ్యులు కూడా నాకు అవసరమైన సమయంలో అండగా ఉన్నారన్నారు. పదవికోసం పాకులాడే వ్యక్తిని కాదని, పదవి వస్తుందంటే ఏ పార్టీలోపడితే ఆ పార్టీలోకి చొరబడే వ్యక్తిని కాదు, ఏ జెండా పడితే ఆ జెండా మోసే వ్యక్తిని కాదన్నారు. నాకు నచ్చితేనే ఆ పార్టీలో ఉంటానని, నాకు రాజశేఖరరెడ్డి నచ్చాడు కాబట్టే కాంగ్రెస్‌లో ఆయన వెంట నడిచానన్నారు. రాజశేఖరరెడ్డి మరణంతో కాంగ్రెస్‌ను కాదని జగన్ మోహన్‌రెడ్డి వెంట మొదటిగా తిరిగినటువంటి వ్యక్తినన్నారు. ఆ రోజు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతాడనుకున్నారా అని ప్రశ్నించారు. సమావేశంలో ఎన్విరాన్‌మెంట్ కార్పోరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, మున్సిపల్ ఛైర్మన్ చల్లం చర్ల లక్ష్మీతులసీ, చల్లంచర్ల సాంబశివరావు, ఆర్యవైశ్య నాయకులు పెరు మాళ్ళ లక్ష్మీ శివ నారాయణ, వెలుగూరి శరత్ బాబు, అచ్యుతశివప్రసాద్, శింగరి నాగ భూషణం, పొట్టి రాజేశ్వర రావు, కూకుట్ల లక్ష్మీ,కొత్త రామకృష్ణ,తల్లం సతీష్, భవిరిశెట్టి సుబ్రమణ్యం, దేవర శెట్టి రవికుమార్, దేవతి సుబ్బారావు, పెద్దసంఖ్యలో ఆర్యవైశ్యులు కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు.

నన్ను ఓడించడానికి ఊరురా తిరుగుతున్నారు

ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు

దాచేపల్లి: జంగా కృష్ణమూర్తి బాగుండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటే ఆయన మాత్రం నన్ను ఓడించడానికి ఊరురా తిరుగుతున్నారని నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్‌కుమార్ యాదవ్ అవేదన వ్యక్తం చేశారు. తప్పు చేశాడు..కానీ పశ్చాత్తాపం పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు బీసీ బిడ్డగా తాను ఇక్కడ ఎంపీగా పోటి చేస్తుంటే నా చేయి పట్టుకుని ఈ ప్రాంతంలో నడిపించాల్సిన ఆయన మాత్రం నన్ను ఓడించేందుకు పనిచేయటం బాధగా ఉందని చెప్పారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్ రెడ్డితో కలిసి ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా వారికి ఘన స్వాగతం పలికారు. గంగమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎంపీగా పోటి చేయమని జంగాకి తానే స్వయంగా ఫోన్ చేసి చెప్పానని, అవసరమైతే ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని సీఎం జగనన్న వద్ద కూడా మాట్లాడతానని చెప్పానని గుర్తు చేశారు. ఏ అభ్యర్థి అయితే బీసీకి టిక్కెట్ ఇస్తే గెలవడని చెప్పాడో, అదే అభ్యర్థి గెలుపు కోసం ఆయన పనిచేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత తన నిధుల్లో నుంచి సింహభాగం నిధులు కేటాయిస్తానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీలో సామాజిక న్యాయమే లేదని, బీసీ నాయకుడైన జంగాకి జగనన్న ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవిస్తే టీడీపీలో చేరి ఒక బీసీకి టిక్కెట్ ఇవ్వద్దన్న ఎంపీ కోసం ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు సంకురాత్రి వీరయ్య, ఉపసర్పంచ్ షేక్ పెదహుస్సేన్, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, మాజీ ఉపసర్పంచ్ సైదుమస్తాన్, యార్డు మాజీ డైరెక్టర్ చాప శేషయ్య, నాయకులు జంగా ఏసయ్య, జంగా నారాయణ, యలగాల నరసింహరావు, పోలే సుధీర్, షేక్ జానీ, పోలే కోటేశ్వరరావు, మేదర దానియేలు, కుర్రి అజయ్ పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని ఒక ప్రయాణికుడు మృతిచెందగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఈ ఘటన జరగ్గా, ప్రమాదానికి గురైన బస్సులు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో సుమారు నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్దదోర్నాల మండల పరిధిలోని తుమ్మలబైలు-చింతల గిరిజనగూడేల మధ్యలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన ఊట్ల రాజారావు(68) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఎనిమిది మంది క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రానున్నది జగనన్న ప్రభుత్వమే

గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



దాచేపల్లి : టీడీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు పగటి కలలు కంటున్నారని, ఆ దేవుడి దయ, ప్రజల ఆశీస్సులతో మళ్లీ జగనన్న ప్రభుత్వం రాబోతోందని గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ జగనన్న ఒక పథకం ప్రజలకు ఇస్తామంటే చంద్రబాబు మూడు ఇస్తామని ప్రజలకు చెబుతున్నారని, కేవలం అధికారంలోకి రావడం కోసమే చంద్రబాబు అమలు చేసేందుకు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారన్నారు. చంద్రబాబు ఆయన మాయకూటమి నాయకులు ఎన్ని కుట్రలు, తప్పుడు హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించిన జగనన్నకే ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం పుల్లయ్య, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి సైదారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, నాయకులు గురవారెడ్డి, పరిమి బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోండి

ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

గురజాల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలా... గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలు పెట్టే చంద్రబాబునాయుడు కావాలా అని ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పులిపాడు, గంగవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ 40 ఏళ్ల అనుభవం 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు పాఠశాలలు బాగుపరచి విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని, వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చే విధంగా చూడాలన్న ఆలోచన రాలేదా అని ప్రశ్నించారు. మొదటి సారిగా ముఖ్యమంత్రి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన ఆలోచనలతో చంద్రబాబుకు నిద్రపట్టని రాత్రులు ఎన్నో ఉన్నాయన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు పేరుతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీలో వుందన్నారు. పాలనా సౌలభ్యంలో భాగంగా గ్రామాల్లోనే అన్ని సౌకర్యాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాజశేఖర్‌రెడ్డి కడుపున పులి లాంటి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టాడని నా కడుపున పప్పు ముద్ద లాంటి లోకేష్ పుట్టాడని చంద్ర బాబు నాయుడు బాధపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కొమ్మినేని బుజ్జి, కొమ్మినేని రవిశంకర్, మన్నెం గురవయ్య, పరిమి శ్రీను, ఎం శ్రీనివాసరావు, ఓర్సు కొండలు, మాటూరి మరియదాసు, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, బి బ్రహ్మం, కావూరి అంజిబాబు, తదితరులున్నారు.

నియోజక వర్గ అభివృద్ధి పీఆర్కేతోనే సాధ్యం

దుర్గి: నియోజక వర్గ అభివృద్ధి పీఆర్కేతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరుతూ మండలంలోని మంగాపురం తండాలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి గడపకు వెళ్ళి గత 59 నెలలుగా ప్రభుత్వం అందించిన పథకాలు, అభివృద్ధి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలుకూరి రామారావు, ఎంపీటీసీ బొంతా కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు, అరిగెల కొండలు, కలవల గోవిందరావు, మాదాసు వాసు, మాదాసు భిక్షమయ్య, దేవరకొండ పున్నారావు, కొప్పుల కొండలు, మాదాసు హనుమంత రావు, మోతీలాల్ నాయక్, కేతావత్ శ్రీను నాయక్, రవి నాయక్, బాలునాయక్, మునినాయక్ పలువురు అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ కానిస్టేబుల్



మాచర్ల రూరల్: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ వారికి గ్రామంలో స్వాగతం పలికి భోజనం పెడతామంటూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసి అడ్డుకోబోయిన పోలీసు తల పగలకొట్టిన సంఘటన ఆదివారం మండలంలోని అడుగురాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలోకి వెళితే వైఎస్సార్‌సీపీ పార్టీ అభ్యర్థులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను పిలిపించాలంటూ రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే పీఆర్కే సతీమణి పిన్నెల్లి రమాదేవి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి కార్యకర్తలు, నాయకులకు భోజనం ఏర్పాటు చేశారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు రామిశెట్టి సుబ్బారావు, మరికొందరు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపైకి వెళ్ళి దాడికి దిగి గొడవ పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న విజయపురి సౌత్ పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువురికి సద్దుబాటు చేసే ప్రయత్నంలో టీడీపీ నాయకులు పోలీసులపై తిరగబడి దాడి చేశారు. ఈ సమయంలో హెడ్ కానిస్టేబుల్ మోడవత్ సాంబశివ నాయక్ తలకు తీవ్రగాయమైంది. ఆయనతో పాటు పలువురికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎన్నో సంవత్సరాల నుంచి గ్రామం ప్రశాంతంగా ఉన్న సమయంలో ఎన్నికల్లో ఓట్ల కోసం టీడీపీ నాయకులు వర్గాలు, గొడవలు సృష్టిస్తున్న టీడీపీ నాయకులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, పక్కన మంత్రి అంబటి

సత్తెనపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబును, వారి కూటమిని నమ్మలేక, వారి మేనిఫెస్టో పై విశ్వాసం లేక జగనన్న మేనిఫెస్టోకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలోకి చేరికలు పెరుగుతున్నాయని జలవనరుల శాఖా మంత్రి, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార పాదయాత్ర లో భాగంగా జరిగిన చేరికల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా 1,2 వార్డుల నుంచి 60 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి నాయకులు సాదరంగా ఆహ్వానించారు.ఒకటవ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరావు, స్థానిక నాయకులు నిజాంపట్నం అమరేంద్రల ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల్లో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రానున్నారని, ప్రజలు ఎప్పుడో ఫిక్స్ అయ్యారన్నారు. కూటమిగా వచ్చినా, కట్టకట్టుకు వచ్చినా జగనన్నను ఎవరూ ఆపలేరన్నారు. నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఓటమి భయంతోనే కూటమిగా వస్తున్నారని, అబద్దపు వాగ్దానాలతోనైనా సరే అధికారం చేపట్టాలని కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు..కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెండెం బాబురావు, జిల్లా గ్రంధాల యాల సంస్థ మాజీ ఛైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మున్సిపల్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు ఉన్నారు.

కారెంపూడి: కారెంపూడి మండలంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన మరో 35 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికి ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి చేకూర్చిన లబ్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పేటసన్నెగండ్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: కూటమిలో కుమ్ములాటలతో టీడీపీ,జనసేన పార్టీ నుండి వైఎస్సార్‌సీపీలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయి. పెదకూరపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నంబూరు శంకర రావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలు వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మండలంలోని పాటిబండ్ల, హుస్సేన్‌నగరం, బలుసుపాడు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారరని, పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు.



హుస్సేన్‌నగరంలో టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న శంకరరావు



పాటిబండ్ల లో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న శంకరరావు

కుటుంబ సమేతంగా..



వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుమార్తె మణి కుమారి, అల్లుడు గంగాధర్, కోడలు స్వప్న వినుకొండ రూరల్ అందుగుల కొత్తపాలెంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడుని, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌పై టీడీపీ నాయకుల దౌర్జన్యం

నాదెండ్ల: గణపవరంలోని శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చే వారిని టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారు. ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున నగదు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా కెమెరాలు ఏర్పాటు చేసింది. ఆ ఇంట్లోకి వచ్చి పోయే వారిని గుర్తించడంతో.. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆ ఇంటి వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో టీడీపీ నాయకులు స్క్వాడ్‌కు అడ్డు తగిలారు. ఇద్దరు సిబ్బందిని చొక్కా పట్టుకుని లాగి పడేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఎక్కడున్నా సంబరమే..





సత్తెనపల్లి: సందర్భం ఏదైనా.. మంత్రి, సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు ఎక్కడ ఉంటే.. అక్కడ సంబరమే. ఆయన ఏ పనిచేసినా అది అంబరమే. ఆదివారం సత్తెనపల్లి పట్టణంలో అంబటి ఎన్నికల ప్రచారం అంబరాన్నంటేలా సాగింది. గజమాలల స్వాగతం, కోలాట నృత్య వినోదం నడుమ ఆయన ఎన్నికల ప్రచారం సాగింది. 30వ వార్డు ఇన్‌చార్జ్ ఉల్లంఘుల విజయలక్ష్మి గుమ్మడికాయతో దిష్టి తీశారు. స్థానిక వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరావు గజమాలతో మంత్రి అంబటి దంపతులను సత్కరించారు.

ఆరోగ్యమస్తు

ఇదిగో..మార్పు



ఎంసీహెచ్ వార్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజని, ఎమ్మెల్యే ముస్తఫా, అప్పిరెడ్డి, కావటి, లక్ష్మణరావు

వైద్యం అందుబాటులోకి వచ్చింది. అన్ని రకాల సేవలు అందున్నాయి. ఖరుదైన వైద్యం పేదలకు చేరింది. నాడు- నేడుతో వైద్యరంగం ఎన్నడూ లేని మార్పు సంతరించుకుంది. ప్రస్తుతం అధునాతన సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వైద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా గుంటూరు సమగ్ర ఆస్పత్రి వైద్యానికి ప్రసిద్ధి చెందింది.

- జీజీహెచ్ వైద్యారంగానికి తలమానికం
- ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ
- కోట్లాది రూపాయల పరికరాలు మంజూరు
- భవన నిర్మాణాల కోసం రూ.కోట్లు ఖర్చు

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాస్పత్రిగా గుంటూరు జీజీహెచ్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. గత ప్రభుత్వం హయాంలో టార్చిలైట్ వెలుతురిలో ఆపరేషన్లు.. ఎలుకల దాడిలో పసికందు మృతి లాంటి ఘటనలతో ఆస్పత్రి ప్రతిష్ట మసకబారింది. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు జీజీహెచ్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు.

పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి...

యూరాలజీ, న్యూరాలజీలో అదనపు యూనిట్లు మంజూరు చేశారు. నూతనంగా 15 ప్రొఫెసర్లు, 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు మంజూరు చేశారు. జీజీహెచ్‌లో 250 స్టాఫ్ నర్సుల పోస్టులు మంజూరు చేశారు. ఒకేసారి గుంటూరు వైద్య కళాశాలలో 46 పీజీ సీట్లు, ఆరు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరు చేయించడం ఓ చరిత్రే. 110 పారా మెడికల్ పోస్టులు నూతనంగా మంజూరు చేశారు. గుంటూరు వైద్య కళాశాల ఆధునికీకరణకు రూ.500 కోట్లు, పీజీ సీట్ల వసతుల కల్పనకు రూ.40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

మంత్రి రజని చొరవతో ఎంసీహెచ్ వార్డు

టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రెండు సార్లు శిలాఫలకాలు వేసి ఒక్క ఇటుక కూడా కట్టకుండా పబ్లిసిటీ చేసుకున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ వార్డు (మాతాశిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వం, జింకానా సహకారంతో రూ. 80 కోట్లతో నిర్మితమవుతున్న ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎంసీహెచ్ నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం మూడు అంతస్తులు నిర్మాణం పూర్తయింది. కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి రూ.70 లక్షలతో గైనిక్ విభాగాన్ని ఆధునికీకరించారు. అత్యవసర చికిత్సలకు రోగులను తరలించేందుకు రూ.70 లక్షలతో రెండు అంబులెన్సులను మంత్రి రజని జీజీహెచ్‌కు అందజేశారు. గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన సర్వీస్‌బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7.5 కోట్లు మంజూరు చేసింది. కాకుమానువారితోటలో నూతన ఓపీ భవన నిర్మాణం కోసం మంజూరు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ. 3.5 కోట్లు మంజూరు చేశారు. ఆసుపత్రిలో సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతులు కోసం రూ.8.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

అదనపు హంగులు...

అదనంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎమర్జెనీ మెడిసిన్ వంటి వైద్య విభాగాలు ప్రభుత్వం మంజూరు చేసింది.



పరికరాలకు తగిన నిధులు

వైద్య పరికరాలకు రూ. 64 కోట్లు మంజూరు చేశారు. క్యాన్సర్ సెంటర్‌లో రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్‌సిటీ పరికరం కొనుగోలుకు అవకాశం ఇచ్చారు. ఆస్పత్రికి రూ. 4 కోట్లు ఖరీదుచేసే సీటీస్కాన్ పరికరాన్ని మంజూరు చేశారు. రూ.15 కోట్ల ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, రూ.40 లక్షలు ఖరీదు చేసే సీఆర్మ్, రూ.25 లక్షలు ఖరీదు చేసే కొలనోస్కోపి, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఏబీజీ మిషన్‌లు, రూ.25 లక్షలు ఖరీదు చేసే మైక్రోస్కోప్, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్ లైట్లు, రూ.15 లక్షలు ఖరీదు చేసే మానిటర్స్, రూ.16 లక్షలు ఖరీదు చేసే ఓటీ కార్ట్స్, రూ.20 లక్షలు ఖరీదు చేసే ఎకోమిషన్, ఎన్ఐసీయూ, పీఐసీయూలో కోటి రూపాయల ఖరీదు చేసే వైద్య పరికరాలను మంజూరు చేశారు. కొవిడ్‌లో ఆసుపత్రి మొత్తం ఆక్సిజన్ సరఫరా జరిగేలా కోట్లాది రూపాయలు ఖరీదు చేసే ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణం, ఆక్సిజన్ పైపుల నిర్మాణం చేయడంతోపాటు, 200లకుపైగా వెంటిలేటర్లను ప్రభుత్వం సరఫరా చేసింది.



రూ. 4 కోట్లు ఖరీదుచేసే సీటీస్కాన్



ఐదేళ్లలో..రూ.6లక్షల లబ్ధి..

గుడిపాడు(క్రోసూరు): సీఎం జగనన్న అందించిన సంక్షేమ ఫలాలతో అత్యధికంగా రూ.6లక్షల లబ్ధి పొందినట్లు గుడిపాడు గ్రామానికి చెందిన షేక్ జానీ బేగం సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం సోషల్ మీడియా బృందం(శంకరన్న కోసం) ఎన్నికల ప్రచారం చేస్తున్న సందర్భంలో గుడిపాడులో షేక్ జానీ బేగం స్పందించారు. అమ్మఒడి, రైతు భరోసా, ఇంట్లో తనకు, తన తల్లికి పింఛను నగదు అందుతోందని, ఇంటి స్థలం, గృహ నిర్మాణం చేసుకున్నట్లు వరుసపెట్టి వివరించారు. ఇంత మంచి చేస్తున్న జగనన్నకే తాము ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.

'కొండ'ంత అభిమానం..



చీరాల: సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలవాలని ఆయన వీరాభిమాని మల్లెల రవీంద్రబాబు ఆదివారం గుణదల కొండను మోకాళ్లపై ఎక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడు. చీరాల మున్సిపాలిటీలోని 9వ వార్డుకు చెందిన రవీంద్రబాబు తన అభిమాన నాయకుడు ఎమ్మెల్యే కావాలని గుణదల మేరిమాతకు మొక్కుకున్నాడు. మోకాళ్లపై కొండ ఎక్కి తన అభిమానాన్ని చాటాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మొక్కుకున్నాడు.





సత్తెనపల్లిలో బారులు తీరిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు



గుంటూరు మహిళా కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకుంటున్న ఉద్యోగులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



వినుకొండ పట్టణంలోని లయోలా పాఠశాలలో క్యూలో ఉద్యోగులు



గణపవరంలో డీఎస్పీ వర్మకు వివరాలు తెలుపుతున్న నరసరావుపేట ఆర్వో నారదముని



ఎస్ఎస్ఎన్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ తీరును పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్



గణపవరంలో వివరాలు ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీకి వివరిస్తున్న నరసరావుపేట ఆర్వో నారదముని

కార్యకర్తలే..
వైఎస్సార్ సీపీ మహా సైన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజని, పక్కన విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

- పశ్చిమ తలరాతను నిర్ణయించే సమయం వచ్చేసింది
- ఈ వారం.. ప్రతి క్షణం అప్రమత్తం అవసరం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- పశ్చిమలోని కార్పొరేటర్లు, నాయకులతో ప్రత్యేక సమావేశం
- హాజరైన మండలి విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

పట్నంబజారు: ఎగిసి పడుతున్న సముద్రపు అలలకు సైతం ఎదురొడ్డి పోరాడగల సత్తా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సొంతమని.. పార్టీకి కార్యకర్తలే మహా సైన్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పోరాటాలతో పుట్టిన వైఎస్సార్ సీపీకి పోరు కొత్తేమి కాదని స్పష్టం చేశారు. అచంచల విశ్వాసంతో.. అలుపెరుగని దీక్షతో ముందుకు సాగే ప్రతి కార్యకర్తకు, నేతకు అండగా ఉంటామని హామీనిచ్చారు. పశ్చిమ తలరాతను నిర్ణయించే సమయం వచ్చేసిందని, ఈ వారం రోజులే అత్యంత కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అప్రమత్తం చేశారు. డివిజన్‌లో ఇప్పటికే క్షేత్రస్థాయికి వెళ్లి నాయకులంతా కష్టపడి పనిచేస్తున్నారని, ఇలానే ముందుకు సాగితే ఊహించిన దానికంటే గొప్ప ఫలితాన్ని సాధించవచ్చాన్నారు.

ఐక్యంగా పనిచేద్దాం..

పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలే రేపటి విజయానికి నాంది పలుకుతాయని స్పష్టం చేశారు. పార్టీ జెండాను భుజాన పెట్టుకుని కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు తలెత్తితే.. తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

సాగుదారుడికి సర్వ హక్కు..

ఇదిగో..మార్పు

- అగ్రహార భూముల రీ-సర్వే చారిత్రాత్మక ఘట్టం
- వినుకొండ నియోజకవర్గంలో 17,250 ఎకరాలు
- రీ-సర్వే చేపట్టి సాగుదారులకు హక్కు కల్పిస్తున్న ప్రభుత్వం
- 8,400మందికి పైగా రైతులకు లబ్ధి
- అప్పాపురం, గుమ్మనంపాడు గ్రామాల్లో పూర్తయిన సర్వే



అప్పాపురంలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): అగ్రహార భూముల రీ-సర్వే చేపట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చారిత్రాత్మక ఘట్టానికి తెరతీసింది. వందల ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నా.. భూములపై హక్కు లేక, ఎలాంటి పథకాలు అందక ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించింది. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అసెంబ్లీలో అగ్రహార భూముల సమస్యలపై మాట్లాడటమే కాకుండా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న అగ్రహారం భూములు 17,250 ఎకరాల సర్వేకు మోక్షం లభించింది. మొదటి విడత రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల మండలం అప్పాపురం గ్రామంలో 2022 నవంబరు 9న భూముల సర్వే ప్రక్రియను ఎమ్మెల్యే బొల్లా లాంఛనంగా ప్రారంభించారు.

రైతులకు లబ్ధి..

నియోజకవర్గంలోని నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం 650 మంది రైతులు, తిమ్మాపురంలో 1,400, కొండ్రప్రోలులో 1,060, వినుకొండ రూరల్ మండలం శివాపురంలో 1,200, నాగులవరంలో 300, ఈపూరు మండలం అంగలూరులో 790, బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడులో 1,800, అయ్యన్నపాలెంలో 1,325 మొత్తం 8,400 మందికి పైగా రైతులు అగ్రహార భూములు సర్వే చేపట్టడంతో లబ్ధి పొందనున్నారు. ఎన్నో ఏళ్లుగా హక్కులు లేకుండా ఇబ్బంది వారు ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వినుకొండ నియోజకవర్గంలో అగ్రహారం భూముల వివరాలు

మండలం	రెవెన్యూ గ్రామం	విస్తీర్ణం(ఎకరాల్లో)
నూజెండ్ల	వి.అప్పాపురం	2,070
నూజెండ్ల	తిమ్మాపురం	1,600
నూజెండ్ల	కొండ్రప్రోలు	1,870
బొల్లాపల్లి	గుమ్మనంపాడు	5,000
బొల్లాపల్లి	అయ్యన్నపాలెం	2,771
ఈపూరు	అంగలూరు	1,266
వినుకొండ	నాగులవరం	6,62
వినుకొండ	శివాపురం	2,011

అప్పాపురం, గుమ్మనంపాడు గ్రామాల్లో రీ-సర్వే పూర్తి..

నూజెండ్ల మండలం అప్పాపురం గ్రామంలో 2,070 ఎకరాల అగ్రహార భూముల రీ-సర్వే ప్రక్రియ పూర్తవడంతో పాటు ఫీల్డ్ మ్యాప్‌లను కూడా తయారు చేశారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి త్వరలో ఫాం-5, 8 రైతులకు ఇచ్చేందుకు ప్రక్రియ పూర్తి చేశారు. అలాగే బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడులో ఐదు వేల ఎకరాల అగ్రహార భూముల సర్వే ఇప్పటికే పూర్తయ్యింది. త్వరలోనే పనులు తుది దశకు చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు.



సర్వే పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు (ఫైల్)

ప్రభుత్వ నిర్ణయానికి ధన్యవాదాలు



దశాబ్దాల నుంచి అగ్రహారం భూములు సర్వేకు నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. భూములపై హక్కులు లేకపోవడంతో ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందక చాలా కాలం నుంచి కష్టాలను చవిచూశాం. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఎమ్మెల్యే బొల్లా చొరవతో రీ-సర్వే ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలోనే రైతులకు పూర్తి హక్కులు రానుండటం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయానికి ధన్యవాదాలు.

-పొట్లపల్లి పిచ్చిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు, అప్పాపురం.

హక్కుల కల్పన శుభపరిణామం



మాకు వారసత్వంగా అగ్రహార భూముల్లో 8 ఎకరాలు ఉంది. అయితే ఆ భూములపై ఎలాంటి హక్కులు లేకపోవడంతో ఇప్పటి వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పొలాలు అమ్ముకోవాలన్నా, కొనాలన్నా కేవలం అగ్రిమెంట్ల ఆధారంగానే లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వం అగ్రహారం భూములు రీ-సర్వే చేసి హక్కులు కల్పిస్తుండటంతో శుభపరిణామం.

- మార్కాపురం చెన్నారెడ్డి, రైతు, వి.అప్పాపురం.